క్లుప్తంగా

నేడు శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం


శ్రీగిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన శ్రీగిడ్డాంజనేయ స్వామి ప్రభోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి ప్రభోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం శ్రీగిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులు ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగించి తిరిగి దేవాలయం వద్దకు చేరుస్తారు.

ద్విచక్రవాహనదారుడికి గాయాలు


గాయపడిన పరమేష్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం డొంగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. బేతంచెర్ల గ్రామానికి చెందిన పరమేష్ ద్విచక్ర వాహనంపై నంద్యాలకు వెళ్తుండగా డొంగు వద్ద జాతీయ రహదారిపై యూటర్న్ చేసుకునే సమయంలో మరో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పరమేష్ గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. తర్వాత ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

ఫెర్రర్ సేవలు మరువలేనివి


గుండ్రేవుల గ్రామంలో విన్సెంట్ ఫెర్రర్ జయంతిలో గ్రామస్తులు

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధికి రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ సంస్థ) వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ సేవలు మరువలేనివని గుండ్రేవుల గ్రామ పెద్దలు శ్రీనివాసులురెడ్డి, రాముడు, బజారి, సయ్యద్‌బాబు అన్నారు. మంగళవారం ఫెర్రర్ జయంతి సందర్భంగా పెద్దలు, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి గ్రామంలోని ఆయన విగ్రహానికి జలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. అదే విధంగా భారీ కేక్‌ను కట్‌చేసి ఒకరికి ఒకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలు మాట్లాడుతూ.. ఎక్కడో స్పెయిన్ దేశంలో జన్మించి మన ప్రాంత ప్రజల అభివృద్ధికి విశేషంగా సేవలందించిన గొప్ప మానవతావాదిగా ఫెర్రర్ గుర్తింపు పొందారన్నారు. కాగా 2009 సంవత్సరంలో తుంగభద్ర నదికి వచ్చిన వరదలలో గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి ఆర్డీటీ సహాయం అందించిన విషయం తెలిసినదే.

అబ్బాస్ నగర్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు: కల్లూరు శివారులోని అబ్బాస్ నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్రహ్మయ్య ఆచారి షెడ్డులో కాపురముంటూ అందులోనే కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లాడు. మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు కర్నూలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో కిరాణ వస్తువులతో పాటు ఇంటి వస్తువులు, బట్టలు మొత్తం కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.2 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారుల అంచనా.

బీజేపీ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ముగ్గురు రాష్ట్ర బాధ్యులతో జిల్లా కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కూటమిలో భాగంగా ఆదోని నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ బీజేపీ కేటాయిస్తున్నారని ఆ సీటు నుంచి తాము తప్పుకుంటే రూ.3 కోట్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సోదరుడు టీడీపీ నాయకులతో మాట్లాడిన ఆడియో వైరల్ అయింది. ఈ విషయాన్ని బీజేపీ అధిష్టానం సీరియస్‌గా పరిగణించింది. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మధుకర్‌జీ నేతృత్వంలో సోమవారం ఆదోనిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం వాడివేడిగా జరిగింది. ఆదోని అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి వాల్మీకిని మార్చాలని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోనికి చెందిన కొందరు ముఖ్య నాయకులు పట్టుపట్టినట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ మురారెడ్డికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. ఆదోని అసెంబ్లీ ఎన్నికల నిర్వహణతో పాటు, జిల్లా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విట్టా రమేష్‌లతో కూడిన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.


మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు


గడిగరేవులలో పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు


కొండజూటూరులో రంగులు చల్లుకుంటున్న యువకులు


సి.బెళగల్‌లో శ్రీ రంగస్వామికి పల్లకీసేవ

ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు

- గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు
- రంగులు చల్లుకుంటూ సంబరాలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

గడివేముల: క్రోధి నామ తెలుగు సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది సంబరాలు చేసుకున్నారు. ఉగాది పర్వదినం రోజున షడ్రుచుల ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు. సంప్రదాయ దుస్తులు ధరించి, కుటుంబసభ్యులతో కలిసి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడివేములలో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ అమ్మవారిని మండల ప్రజలతో పాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి రాత్రి వరకు ఆకుపూజలు నిర్వహించారు. అలాగే బిలకలగూడూరులోని బాలాజీ దేవాలయం, శ్రీదుర్గా భోగేశ్వరాలయం, కొరటమద్దిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం గడివేములలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద పండితులు, గడిగరేవుల గ్రామంలోని శివాలయం వద్ద భోగేశ్వరాలయం ప్రధానార్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, రైతులు సుభిక్షంగా ఉంటారని చెప్పారు. గడిగరేవుల గ్రామంలో స్వామివారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భోగేశ్వరాలయం చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ రామానుజన్, గ్రామ పెద్దలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రైతులు కాడెద్దులతో పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించి, పొలం పనులను ప్రారంభించారు.

గ్రామదేవతలకు బోనాలు

పాణ్యం : మండలంలో తెలుగు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఇప్పటికే పంటలు చేల నుంచి ఇంటికి చేరుకోవడంతో కొత్త ధాన్యాలతో ప్రజలు పండి వంటలను తయారు చేసి, గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ తమ ఉత్సాహాన్ని పంచుకున్నారు.

-మండల కేంద్రమైన పాణ్యంలోని శ్రీ సుంకులాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి చెంచుమహిళలు బొనాలు సమర్పించారు. చెంచుకాలనీలో ప్రజలు భారీగా పాల్గొన్నారు.

- మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో శ్రీ పుట్టాలమ్మ అమ్మవారికి ప్రజలు గ్రామం తరుపున బొనాలు ఎత్తారు. ఎద్దులను రంగుల రంగులతో అలంకరించి తేరుతో వెళ్లి బొనాలు అందించారు. మంగళవాయిద్యాలతో బొనాలను ఊరేగించారు. అనంతరం పుట్టాలమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. అలాగే పిండి వంటలతో తయారు చేసిన నైవేద్యాలను సమర్పించారు.

ఊరూరా ఉత్సవాలు

ఓర్వకల్లు : శ్రీ క్రోధి నామ సంవత్సరాదిని పురస్కరించుకొని మంగళవారం మండలంలో ఊరూరా ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. కన్నమడకల, ఓర్వకల్లు, శకునాల, బ్రాహ్మణపల్లె, హుసేనాపురం, సోమయాజులపల్లె, ఉయ్యాలవాడ గ్రామాలలో మహిళలు ఉదయాన్నే గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో హుసేనాపురం, నన్నూరు, కన్నమడకల గ్రామాలకు చెందిన కురువ సంఘం భక్తులు పాల్గొని అమ్మవారికి బలిదానం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో భాగంగా బీరప్ప డోలు లయ విన్యాసాలు, కర్రసామి ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

గూడూరు: పట్టణంలో ప్రజలు మంగళవారం నూతన తెలుగు సంవత్సర పండుగ ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాలను రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజలు కొత్త బట్టలు దరించి దేవాలయాలను సందర్శించి పూజలు చేసారు. సుంకులమ్మ దేవాలయం కిట కిటలాడింది. సాయంత్రం ఆంజనేయస్వామి ఆలయ అవరణలో పండితుడు శర్మ పంచాగ శ్రవణం చేశారు. ఈ ఏడాది ఎర్ర పంట, ఎర్ర ఎద్దులకు కలిసి వస్తుందని తెలిపారు. కందులు, మిరప, శనగ, తదితర ఎర్ర రకం పంటలు వేసుకోవాలని సూచించారు.

- కొండజుటూరులో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు రంగుల చల్లుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.
- పాణ్యంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో వేదపడింతులు సుబ్బుశాస్త్రి ఉగాది పంచాంగం వినిపించారు. అలాగే ఉగాది పండుగ విశిష్టతను గురించి వివరించారు.

వైభవంగా ఉగాది

సి.బెళగల్: తెలుగు సంవత్సరాది ఉగాది ఉత్సవాలను మండల ప్రజలు మంగళవారం వైభంగా నిర్వహించుకున్నారు. ప్రజలు వారి పేరుబలాలను రాశులకు అనుగుణంగా శాస్త్రులు, పురోహితులను అడిగి తెలుసుకున్నారు. రైతులు వేకువ జామునే పొలాలకు వెళ్లి కొత్త సంవత్సర వ్యవసాయ పనులను ప్రారంభంలో భాగంగా మొదటి దుక్కులను దున్నారు. ఎద్దులను, కాడులను, వ్యావసాయ పనిముట్లను అందంగా అలంకరించి, నూతన దుస్తులు ధరించి వారి వారసులతోను పనులను ఆరంభింపచేశారు. సి.బెళగల్‌లోని శ్రీ రంగస్వామి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామంలో ఊరేగించిన అనంతరం స్వామివారి దేవాలయంలో ఆలయ పూజారులు వెంకటేశ్వర్లు, పురోహితులు నరసింహరావుతో గ్రామస్తులకు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలోని శ్రీ చింతలముని రంగడు, నల్లారెడ్డి స్వాముల ఆలయాలలో భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, హైకోర్టు న్యాయమూర్తి సీబీ రామ్మోహన్‌రెడ్డి, సింగల్‌విండో మాజీ చైర్మన్ సీబీ గోవిందరెడ్డి, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదేవిధంగా మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో శ్రీ లక్ష్మివెంకటేశ్వర్ల ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఘనంగా ఊరేగించారు. ఉగాది ఉత్సవాలలో భాగంగా గ్రామస్తులు ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో ఫలహారాలతో గ్రామ చివర పొలాల్లో కొలువైన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని మొక్కులను చెల్లించుకున్నారు.


గడివేములలో ఎద్దుల బండిని అలంకరించుకుని వెళ్తున్న రైతన్న


ఓర్వకల్లులో భక్తుల కర్రసాము విన్యాసం


గూడూరులో పంచాగం వినిపిస్తున్న పండితుడు శర్మ.


ఓర్వకల్లులో బీరప్ప డోలు లయ విన్యాసంతో కళాకారులు


నెరవాడలో తేరును తీసుకెళ్తున్న ఎద్దు


నెరవాడలో బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

కఠిన రోగాలకు తీపి వైద్యం!

- జిల్లాలో హోమియోకు ఆదరణ
- గతంతో పోలిస్తే పెరిగిన రోగులు
- జిల్లాలో 19 ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీలు
- అన్ని చోట్ల ఉచితంగా చికిత్స మందులు
- దీర్ఘకాలిక జబ్బులకు, మొండి రోగాలకు చక్కటి వైద్యం
- నేడు వరల్డ్ హోమియోపతి డే



కర్నూలు(హాస్పిటల్): చాలా మంది జబ్బు చేసినప్పుడు మందులు వేసుకోవాలంటే ఇబ్బంది పడుతుంటారు. కొన్ని రకాల మందులు, సిరప్‌లు చేదుగా ఉంటాయని తిరస్కరిస్తుంటారు. కానీ ఏ వ్యాధికైనా తియ్యని గుళికలతో నాలుకకు, మనసుకు ఇబ్బంది లేకుండా మందును అందించే ఏకైక వైద్యవిధానం హోమియోపతి. ఈ వైద్యులు ఇచ్చే మందులు నోట్లో వేసుకోగానే కమ్మగా కరిగిపోతాయి. జర్మని దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హనీమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు. ఆయన 1755 సంవత్సరం ఏప్రిల్ 10న జన్మించారు. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన హోమియో డేగా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

హోమియోపతి ప్రాముఖ్యత

ప్రపంచ హోమియోపతి దినోత్సవం ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఎందుకంటే ఇది ప్రత్యామ్నాయ వైద్యం గురించి అవగాహన పెంచుతుంది. ఏప్రిల్ 10న డాక్టర్ శామ్యూల్ హనీమన్ పుట్టిన రోజును పురస్కరించుకుని హోమియోపతి గురించి అవగాహన కల్పించేందుకు చాలా మంది ప్రజలు ఒకచోట చేరతారు. హోమియోపతి గురించి అవగాహన పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం. సంపూర్ణ, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఇది ఒక అవకాశం. హోమియోపతి దీర్ఘకాలిక నొప్పి, అలర్జీలు, జీర్ణ రుగ్మతలతో సహా అనేక విభిన్న పరిస్థితులకు చికిత్స చేయడంలో ప్రభావవంతంగా ఉన్నట్లు నిరూపించారు. సంప్రదాయ వైద్యానికి బాగా స్పందించని దీర్ఘకాలిక పరిస్థితుల చికిత్సకు ఇది ప్రత్యేకంగా సరిపోతుంది. హోమియోపతి కూడా సురక్షితమైనది, సున్నితమైనది. కొన్ని దుష్ప్రభావాలతో, కఠిన మందులను నివారించాలనుకునే వ్యక్తులకు ఇది ఒక ప్రసిద్ధఎంపిక.

జిల్లాలో హోమియోపతి ప్రస్థానం

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో రెగ్యులర్, ఎన్‌హెచ్‌ఎం కలిపి మొత్తం 19 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. రెగ్యులర్‌గా పత్తికొండ, పోలకల్, కర్నూలు, వెల్దుర్తి, నంద్యాల, జిల్లెల్ల, డి. బెళగల్, చనుగొండ్ల, క్రిష్ణగిరి, ఆత్మకూరు, పగిడ్యాల, నేషనల్ హెల్త్ మిషన్‌లో చాపిరేవుల, పెద్ద ఎమ్మనూరు, డోన్, ఉలిందకొండ, పెద్ద తుంబళం, సున్నిపెంట, ప్యాపిలి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు ప్రతిరోజూ 35 నుంచి 50 మంది వరకు కొత్తగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య దీనికి రెట్టింపుగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచే ఉంటాయి. ఇక్కడ చికిత్స, మందులు పూర్తిగా ఉచితం. దీంతో పాటు కర్నూలు నగరంలో పలు కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడంతో హోమియో వైద్యవిధానానికి మరింత క్రేజ్ ఏర్పడింది. నగరంలో 12 నుంచి 16 దాకా కార్పొరేట్ సంస్థల ఆసుపత్రులు ఉండగా, స్థానిక వైద్యులు జిల్లా మొత్తంగా 650 నుంచి 700 మంది దాకా చికిత్స అందిస్తున్నారు. మొత్తంగా సగటున ఏడాదికి 6 లక్షల మంది దాకా హోమియో వైద్యాన్ని అందుకుంటున్నారు.

మొండి రోగాలకు చక్కని పరిష్కారం !

హోమియో వైద్య విధానంలో మొండి రోగాలకు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుంనొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, ఎగ్జిమా, చెవిలో చీము కారడం, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, స్పాన్డిలైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్ధకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు (సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు, పలు రకాల అలర్జీలు, మైగ్రేన్స్, డిప్రెషన్, క్రానిక్ ఫెటిగ్ సిండ్రోమ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ప్రకోప ప్రేగు సిండ్రోమ్, ప్రీమెన్స్ట్రువల్ సిండ్రోమ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు బాగా ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

డిస్పెన్సరీల్లో ఉచితంగా చికిత్స



జిల్లాలో హోమియోపతి వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హోమియో డిస్పెన్సరిలలో రోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా హోమియో వైద్యానికి గత సంవత్సరంతో పోలిస్తే మందులు బాగా పెరిగాయి. హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నాము. వరల్డ్ హోమియో డేను పురస్కరించుకుని అన్ని డిస్పెన్సరీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాము.

–డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి,
జిల్లా ఆయుష్ అధికారి, కర్నూలు

హోమియోపతితో అద్భుత ఫలితాలు



హోమియోపతి మందుల ద్వారా అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను శాశ్వతంగా నయం చేయవచ్చు. ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు. ఎలాంటి నొప్పి, ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించవచ్చు. ప్రధానంగా థైరాయిడ్, పీసీవోడి, షుగర్, బీపీ, సొరియాసిస్, వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్, మానసిక సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలను హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. వ్యాధి మూలకారణాలను గుర్తించి రోగికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తాము.

–డాక్టర్ విద్యాసాగర్‌రావు,
ప్రభుత్వ హోమియోవైద్యులు, కర్నూలు

14న జై భీమ్ ర్యాలీ

కర్నూలు(అర్బన్): ఈ నెల 14వ తేదీన డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జై భీమ్ ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ నేతలు కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, జేఏసీ అధ్యక్షుడు సోమసుందరం మాదిగ, ప్రధాన కార్యదర్శి అనంత రత్నంమాదిగ, ఐఎన్‌టీయూసీ నాయకులు బతుకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలులో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని రథంపై పెట్టుకొని జైభీమ్ ర్యాలీని ఘనంగా నిర్వహించనున్నామని పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ మాదిగ, కిరణ్‌మాదిగ, లాజరస్‌మాదిగ, రాజుమాదిగ, గిడ్డన్న మాదిగ, శివప్రసాద్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాదిగ జేఏసీ నేతలు

12 నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రమేష్, చందు, వినోద్ మంగళవారం తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఈ నెల 11వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 93460 89027, 62819 71243 నంబర్లను సంప్రదించాలన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుపై రాయితీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు ఆస్తి పన్ను ఈ నెల 30వ తేదీలోగా చెల్లించే వారికి 5 శాతం రాయితీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై ఉన్న పన్నులు చెల్లించే వారికి రాయితీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల వసూలు కౌంటర్లో లేదా వార్డు సచివాలయాలు, ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా కార్యాలయంలో పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

వైభవంగా శ్రీవల్లెలాంబాదేవి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లెలాంబాదేవి


అశేషజనవాహిని మధ్య సాగుతున్న రథోత్సవం

కోడుమూరు రూరల్ : పట్టణ సమీపంలో హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబాదేవి రథోత్సవం మంగళవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలేగాకా, జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వల్లెలాంబా..చల్లగా చూడమ్మా... అంటూ భక్తుల నామస్మరణ మధ్య అమ్మవారి రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. అంతకుముందు భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి స్వగృహం నుంచి అమ్మవారికి మొదటి నైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీవల్లెలాంబదేవికి సమర్పించిన అనంతరం దేవి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని చిన్నబోయ వీధి కాలనీవాసులు బోనపుకుండలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పూజలు

శ్రీవల్లెలాంబాదేవి తిరునాల సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన అమ్మవారి రథోత్సవంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు.

పోటీలను ప్రారంభించిన డాక్టర్ సతీష్

శ్రీవల్లెలాంబాదేవి తిరునాలలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మంగళవారం సాయంత్రం పారంభించారు. అలాగే తిరునాల సందర్భంగా ఎస్ఎన్ఆర్ హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన రేలా..రే..రేలా జానపద నృత్యం, నృత్య ప్రదర్శన కార్యక్రమాలను జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ ఉపసర్పంచు మాదులు, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, రాఘవేంద్ర, లింగమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రథానికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్


అమ్మవారికి మొదటి నైవేద్యాన్ని తీసుకెళ్తున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు